సింగిల్ పేజీ కథ

# ఐ పిటీయూ...

**-ఎ. సురూపశరత్‌రావు**

“మమ్మీ... ఈ రోజు నా బట్టలు ఇస్త్రీ చేసివ్వవూ ప్లీజ్...” అంటూ మెడచుట్టూ చేతులువేసి గారాలుపోతూ అడుగుతోన్న బాబును చూస్తే ముచ్చటేసింది.

వాడు రోజూ అంతే! డ్రెస్ ఏమాత్రం ముడతరాకుండా చూసుకుంటాడు.

సాక్స్ కూడా ఏరోజుకారోజే చక్కగా ఉతికి శుభ్రంగా ఉండాలంటాడు. పది నిముషాలముందే స్కూల్లో



ఉండాలంటాడు.

ఇదంతా వాళ్ళ స్కూల్లో పనిచేస్తోన్న పి.ఇ.టి.గారి చలవే... ఏ లోపం కనపడ్డా... లేట్ అయినా పిల్లలు ఆవిడ శిక్షకు పాత్రులు కావలసిందేమరి...

ఒక్క బట్టలేమిటి... బ్యాగూ... నోట్సూ... చేతి గోళ్ళ దగ్గరినుండి టై వరకూ చాలా సిస్టమేటిగ్గా ఉండాలంటారావిడ.

ఒక్క మా బాబేకాదు. ఆ స్కూల్ పిల్లలంతా, నిద్దట్లో ఆవిడ పేరు చెప్పినా సరే... గడగడలాడుతూ లేచి కూర్చుంటారు.

నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఇంట్లో ఒకరిద్దరు పిల్లలను కంట్రోల్ చెయ్యడమే గగనమౌతుంది.

అలాంటిది దాదాపు పదిహేను వందల మంది పిల్లలు క్రమశిక్షణపాటిస్తూ ఆమెకు కట్టుబడి ఉండటం సామాన్యమైన విషయమేం కాదు. నిజంగా ఆమెను అభినందించాలి.

ఓ శుభముహూర్తాన వాళ్ళింటికి బయలుదేరాను. గేట్లోనే ఎదురయ్యారు వాళ్ళ పిల్లలు.

ఒంటిమీద బట్టలన్నీ మట్టి కొట్టుకుపోయి చేత్తో మట్టి విసిరివేస్తూ జిడ్డోడుతున్నారు.

వాళ్ళ గది స్పష్టంగా కనపడుతోంది. చిందరవందరగా పడి ఉన్న నోట్స్‌తో చిత్తుకాగితాలతో చాలా అసహ్యంగా... అస్తవ్యస్తంగా ఉంది.

పి.ఇ.టీ.గారు కర్రపుచ్చుకుని వచ్చారు కోపంగా అరుస్తూ... పిల్లలిద్దరూ ఆవిడను ఎద్దేవా చేస్తూ చేతిలోని కర్ర లాక్కుని తుర్రుమని పరిగెత్తారు.

నేనూహించిన దానికీ... చూస్తున్న దృశ్యానికీ ఏమాత్రం పొంతన లేదు.

“ఈ కోతి వెధవలతో వేగలేక ఛస్తున్నాను. అంతా నా ఖర్మ” అనుకుంటూ నుదురు బాదుకుంటోన్న ఆవిడను చూస్తే నాకెందుకో నవ్వాగలేదు.

కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువ అని ఊరికే అన్నారా?...

‘పిల్లలందరినీ గడగడలాడించే అపర వీరనారీమణీ... ఐ. పిటీ యూ... పి.ఇ.టీ.!’

అనుకుంటూ గేట్లోనుండే వెనక్కి తిరిగాను.


ఎ. సురూపశరత్‌రావు,
Wlo ఎ. శరత్‌రావు,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్,
ఆర్మూర్


★